
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కొలువుదీరిన గణనాథులు

- మండపాల వద్ద ప్రత్యేక పూజలు
- కొనుగోలుదారులతో మార్కెట్లో కిటకిట..
- ఘనంగా ప్రారంభమైన గణపతి నవరాత్రి ఉత్సవాలు



పెద్దపల్లి పట్టణంలోని తెనుగువాడలో ఏర్పాటు చేసిన గడ్డి వినాయకుడు



ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో..



రామగిరి మండలం కల్వచర్లలో..



గోదావరిఖని వాసవ్య స్కూల్‌లో..

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 8 : వినాయక చవితి పర్వదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆయా కాలనీల్లో ఆలయాల వద్ద విద్యాలయాల వద్ద గణపతి విగ్రహాలను నెలకొల్పి పూజలు సమర్పించుకున్నారు. ప్రతిఏటా తెనుగు వాడలో గడ్డి వినాయకుడు, ప్రభుత్వ కళాశాల మైదానంలో చత్రపతి యువసేన ఆధ్వర్యంలో 54 అడుగుల ఎత్తు ఉన్న మట్టి వినాయక విగ్రహాన్ని నెలకొల్పడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి కూడా అదేవిధంగా నెలకొల్పారు. ప్రగతినగర్ కూడలి వద్ద, అమర్‌నగర్ కూడలి వద్ద సుభాష్‌నగర్ కూడలి వద్ద భూంనగర్ కూడలి, శాంతినగర్ కూడలి, హనుమాన్‌నగర్, హనుమాన్ ఆలయం, బృందావన్‌కాలనీ, వైశ్యభవన్, రంగంపల్లిలో ఈ గణపతి విగ్రహాలను నెలకొల్పారు. ఈ సందర్భంగా శనివారం, ఆదివారం వినాయకునికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు, అల్పాహార విందులు కొనసాగించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసి పర్యావరణంపై తమ ఆసక్తిని చాటుకున్నారు. మున్సిపల్‌లోని పదవ వార్డులో స్థానిక ఎమ్మెల్యే విజయరమణరావు వినాయక మండపం వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబూరావు ఈర్ల కొమరయ్య ఎల్ రాజయ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ట్రినిటీ విద్యాసంస్థల్లోనూ, గాయత్రీ విద్యాసంస్థల్లోనూ, పల్లవి విద్యాసంస్థలల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ఆయా విద్యాలయాల ఛైర్మన్లు పూజలు నిర్వహించారు.

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలంలోని 30 గ్రామాల్లో యూత్ సంఘాలు, కుల సంఘాలు, ఆలయాల్లో, చిన్నారులు వినాయక చవితి సందర్భంగా శనివారం మండపాలు ఏర్పాటు చేసి గణనాథుడిని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండవ రోజు ఆదివారం మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పెద్దబొంకూరు, పెద్దకల్వల, చీకురాయి, భోజన్నపేట, హన్మంతునిపేట, రాంపల్లి, మారేడుగొండ, గౌరెడ్డిపేట, రాఘవపూర్, అప్పన్నపేట గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో పోటాపోటీగా గణనాథుడి విగ్రహాలను నెలకోల్పారు. 9 రోజుల పాటు పూజలు నిర్వహించి దగ్గర్లోని చెరువు, గోదా వరి నదులు, కాలువలు, కుంటల్లో నిమజ్జనం చేయనున్నారు.

మంథని : వినాయక చవిత సందర్భంగా మంథని పట్టణం తోపాటు పలు గ్రామాల్లోని వాడవాడలో శనివారంవారం శ్రీగణనాథుడి విగ్రహాలు కొలువుదీరాయి. ప్రత్యేక వాహనాల్లో వాడలకు భాజాభజంత్రీలతో తీసుకొని వెళ్లి ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో వేద పండితుల పూజలతో ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో పలువురు ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. వాడల్లో వినాయక మండపాలతో సందడి నెలకొంది.

ముత్తారం : మండలంలోని 14గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 68 విగ్రహాలు ఏర్పాటు చేశారు. శనివారం గ్రామాల్లో గణనాథుల విగ్రహాలను ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠించారు. గ్రామాల్లోని ప్రధాన కూడల వద్ద తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి అందులో గణనాథులను ప్రతిష్ఠించారు. అలాగే మండలంలోని ప్రతి గణనాథుడి షెడ్డుకు వద్దకు ఎస్ఐ గోపతి నరేష్ తన సిబ్బందితో పరిశీలించి జియో టాకింగ్ చేశారు. ప్రతి మండపంలో రికార్డు బుక్కులను ఏర్పాటు చేశారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ కార్యక్రమాలు చేపట్టవద్దని, ప్రశాంత వాతావరణంలో నవరాత్రులు జరుపుకోవాలని ఎస్ఐ ప్రజలకు అవగాహన కల్పించారు.

కమాన్‌పూర్ : మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు శనివారం అంబరాన్నంటాయి. వినాయక చవితిని పురస్కరించుకొని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు డప్పుచప్పుళ్ల, ఆట,పాటల మధ్య గణనాథులను గణేష్ మండపాల్లో ప్రతిష్ఠించారు. కొలువుదీరిన గణనాథులకు తొలిరోజు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు పోటాపోటీగా గణేష్ మండపాలను సర్వంగసుందరంగా అలకరిం చారు. విద్యుత్తు దీపాల అలంకరణ ఆకర్షణగా నిలిచింది.

కాగా, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రజలు మట్టి గణపతులను ప్రతిష్టించి గణనాథుడి పూజించి, పర్యావరణాన్ని కాపాడాలంటూ సదాశయ ఫౌండేషన్ సభ్యులు శనివారం మట్టి గణపతులను పంపిణీ చేశారు. మట్టి గణపతులను పూజించడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి భక్తులకు వివరించారు.ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవన్‌కుమార్, కార్యదర్శి బీష్మాచారి, క్లబ్ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, కార్యదర్శి నల్లవెల్లి శంకర్, పట్టణ అధ్యక్షుడు అనంతరాములు ఉన్నారు.

సుల్తానాబాద్ : వినాయక చవిత పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం ఆయా మండపాల వద్ద వినాయకునికి విశేష పూజలు నిర్వహించారు. సుల్తానాబాద్ పట్టణంలోని పదిహేను వార్డుల్లో దాదాపు యాభైకి పైగా మండపాలను ఏర్పాటు చేసి వినూత్నమైన వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. శ్రీరాంనగర్ తొమ్మిద వార్డులో కౌన్సిలర్ గొట్టం లక్ష్మి మల్లయ్య, మహేష్ స్వప్న, రేణుక, శ్రీగిరి గోపాల్, రమేష్ తదితరులు మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి, పాత బజారులోని శివాలయంలో, వైశ్యభవన్‌లో, శాస్త్రినగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో, గాంధీనగర్, స్వప్నకాలనీ, పూసాల రోడ్డు, బస్టాండ్ బ్యాంక్ కాలనీ, కాపువాడ, పోచమ్మ వాడ, రజకవాడ, గుడిమిట్టపల్లి, ఇలా దాదాపు యాభైకి పైగా వినాయక మండపాల వద్ద పూజలు నిర్వహించారు. సుల్తానాబాద్ పూసాల రోడ్డులోని వినాయక మండపం వద్ద ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రామగిరి : మండలంలో అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వినాయక చవితి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గ్రామపంచాయతీల్లో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో పదుల సంఖ్యలో వినాయక విగ్రహలను ప్రధాన కూడల్లో ప్రత్యేకంగా అలకరించిన మండపాల్లో ఏర్పాటు చేసుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య ప్రతిష్టాపన మహోత్సవాలను కన్నుల పండువగా జరుపుకున్నారు. నవరాత్రుల సందర్భంగా భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండపాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ చంద్రకు మార్ ప్రత్యేక పోలీస్ పేట్రోలింగ్ పార్టీలను ఏర్పాటు చేశారు.

ఎలిగేడు : మండలకేంద్రంతో పాటు 11గ్రామాల్లోని వాడవాడల వినాయక చవితి పర్వదిన వేడుకల్లో భాగంగా వినాయకులను మండపాల్లో కొలువుతీర్చారు. ఉదయం నుంచి పండుగ వాతావరణం కన్నుల పండువగా జరిగింది. మండపాలను జూలపల్లి పోలీస్‌లు పరిశీలించి సూచనలు చేశారు. ఎస్సై శ్రీధర్ మాట్లాడుతూ నవరాత్రుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు పునఃరావృతం కాకుండా చూసుకునే బాధ్యత నిర్వాహకులపై ఉంద ని అన్నారు. ప్రజలకు డెక్కులతో అలజడి చేయవద్దని సూచించారు.

ఓదెల : మండలంలోని 22 గ్రామాలలో ఆదివారం గణపతి నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అలాగే మండలంలో ప్రతి యువజన సంఘం, కుల సంఘాల ప్రతిపాదికంగా వాడవాడలా 150 మేరకు గణపతి విగ్రహాలను మండపాలలో ప్రతిష్టించారు. ఇకనుంచి తొమ్మిది రోజులపాటు గణపతి మండపాలలో భక్తులు, దంపతులు పవిత్రమైన పూజలు నిర్వహించి చివరి రోజున గణపతి విగ్రహాలతో శోభాయాత్రలు నిర్వహించిన అనంతరం సమీపంలోని చెరువులో నిమజ్జనం చేయనున్నారు.

కోల్‌సిటీటౌన్ : గణపతి నవరాత్రి ఉత్సవాలు శనివారం గోదావరిఖనిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతి విగ్రహాలను కొనుగోలు దుకాణాల నుంచి డప్పు చప్పుళ్లతో మండపాలకు ర్యాలీగా తీసుకురాగా మండపాల్లో వేదమంత్రోచ్చరణల మధ్య గణనాథుడు కొలువుదీరాడు. దీంతో ఈ ప్రాంతంలోని వాడవాడలా గణపతి నవరాత్రి ఉత్సవాలతో పండుగ వాతావరణం సంతరించుకున్నది. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్-మనాలీఠాకూర్ దంపతులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించి హోమం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలను రామగుండం నియోజకవర్గ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, గణనాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రధానచౌరస్తాలో పూజాసామగ్రి, ఇంట్లో పెట్టుకునేందుకు వినాయక ప్రతిమల కొనుగోళ్లు భారీ ఎత్తున జరిగాయి. కాగా గణపతి ప్రతిమలు ఈసారి ఎక్కువగా ధర పలికాయి. రామగుండం కార్పొరేషన్ ఏరియా పద్మశాలి సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రధానచౌరస్తాలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అందజేశారు. సుమారు 500 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. బండారి రాజమల్లు, బూర్ల దామోదర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మంచికట్ల బిక్షపతి, గుండ రాజు, అనుమ రాజమల్లు, సిరిపురం నర్సయ్య, సుంక లింగమూర్తి, మాణిక్యం, ప్రభాకర్, కొముర‌య్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక 8వ డివిజన్ గంగానగర్‌లో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులు నాగుల శివకుమార్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీపీ జిల్లా అధ్యక్షులు గోలివాడ ప్రసన్నకుమార్ హాజరై విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నూరి నాగరాజు, మహేష్, రాజ్‌కుమార్, సూర్య, మహ్మద్‌అబ్బు, భరత్, సూర్యమహదేవ్, గోపిచంద్ మహిళలు పాల్గొన్నారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక్ హరి పర్యటించారు. పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణపతి మండపాలను సతీసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి 22వ డివిజన్ కార్పొరేటర్ కౌశిక్ లత, కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యర్శి మాదాసు శ్రీనివాస్, పలువురు నాయకులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



పెద్దపల్లి పదో వార్డులో గణపతి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



ఈసాలతక్కళ్లపల్లిలో పూజలు నిర్వహిస్తున్న కౌశిక హరి దంపతులు



ఓదెలలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గోదావరిఖనిలో ట్రాక్టర్‌లో గణపతి విగ్రహాన్ని తీసుకువెళుతున్న యువకులు



గోదావరిఖనిలో గణపతి విగ్రహాలను తీసుకువెళుతున్న చిన్నారులు



గోదావరిఖని ప్రధానచౌరస్తాలో పూజా సామగ్రి కొనుగోళ్ల సందడి



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



మట్టిగణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎన్‌సీపీ నాయకులు



హన్మంతునిపేట గ్రామంలో కొలువుదీరిన గణనాథుడు



సుల్తానాబాద్ శ్రీరాంనగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



కమాన్‌పూర్‌లో మట్టి గణపతుల పంపిణీ..

క్యాంపు కార్యాలయంలో

రామగుండం ఎమ్మెల్యే దంపతుల పూజలు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 8: రామగుండం ప్రజలకు గణపతి ఆశీస్సులు ఉండాలని, చల్లగా చూడాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మనాలీ ఠాకూర్ దంపతులు వేడుకున్నారు. వినాయక చవితి సందర్భంగా శనివారం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలోని పాడిపంటలు బాగా పండాలని, రైతులు ఆనందంగా ఉండాలని, రామగుండం అభివృద్ధికి మరింత శక్తిని ప్రసాదించే విధంగా చూడాలని, ప్రజలు అష్టఐశ్వర్యాలతో వెలుగొందాలని ఆకాంక్షించారు.

పలు మండపాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

వినాయక చవితి సందర్భంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పలు మండపాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలకు శని, ఆదివారాల్లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. 46వ డివిజన్ ఎన్‌టీఆర్ నగర్‌లో కార్పొరేటర్ పాతిపెల్లి లక్ష్మి, ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, నాయకులు దాసరి సాంబమూర్తి, మాలెం మధు తదితరులు పాల్గొన్నారు.



గణపతి మండపంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు

వినాయ మండపాలను తనిఖీ చేసిన సీపీ

- భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచన



గణపతి మండపం వద్ద తనిఖీ చేస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, సెప్టెంబరు 8: రామగుండం సీపీ శనివారం రాత్రి గోదావరిఖని పట్టణంలోని గణపతి మండపాలను తనిఖీ చేశారు. స్థానిక లక్ష్మీనగర్‌లోని మండప నిర్వాహకులతో మాట్లాడారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని, భక్తి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇతర వర్గాలను కించపరిచే విధంగా, రెచ్చగొట్టే విధంగా చర్యలు చేపట్టవద్దన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి ఘటనలు జరుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద నిర్వాహకులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏసీపీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

హుజూరాబాద్, సెప్టెంబరు 8: జల్సాలకు అలవాటు పడ్డ ఇద్దరు యువకులు గంజాయిని తరలిస్తుండగా శనివారం పోలీసులు పట్టుకున్నారు. స్థానికంగా ఏసీపీ శ్రీనివాస్‌జీ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని మలంన్‌గిరి జిల్లాకు చెందిన తనుగుల అర్జున్, సుభాష్‌సీసా అనే ఇద్దరు వ్యక్తులు ఇంటర్మీడియట్ మధ్యలోనే ఆపేశారు. ఐదేళ్లుగా గంజాయి పండిస్తూ అక్కడే విక్రయించేవారు. బయట రాష్ట్రాల్లో అమ్మితే ఎక్కువగా డబ్బులు వస్తాయనే భావించారు. గంజాయిని వరంగల్ నుంచి తీసుకొని వస్తుండగా, హుజూరాబాద్ బస్టాండ్ సమీపంలో టౌన్ సీఐ తిరుమల్ గౌడ్, ఎస్‌ఐ యూసఫ్ మహ్మద్ అలీలు తనిఖీ చేశారు. వారి వద్ద 20కిలోల గంజాయి లభించింది. దీంతో ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.. ఈ గంజాయి విలువ రూ. 5లక్షల వరకు ఉంటుందని తెలిపారు. రెండు నెలల క్రితమే 60మంది యువకులకు గంజాయిపై కౌన్సెలింగ్ ఇచ్చావన్నారు. గంజాయి మత్తులో పడి యువకులు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఏసీపీ సూచించారు.



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 8: పెద్దపల్లి ఎల్లమ్మ చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని రంగంపల్లికి చెందిన ఆరేపెల్లి జంపయ్య(33) కలెక్టర్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ క్లర్క్‌గా పని చేస్తున్నాడు. మూడు నెలలుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. తిరిగి రాకపోవడంతో జంపయ్య అన్న రాజేష్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం ఎల్లమ్మ చెరువులో శవమై కన్పించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య సంధ్య, పిల్లలు మన్విత, జశ్వంత్ ఉన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

చొప్పదండి, సెప్టెంబరు 8: పట్టణానికి చెందిన పూదరి లక్ష్మయ్య(50) ఈత చెట్టు పై నుంచి పడడంతో తీవ్ర గాయలయ్యాయి. లక్ష్మయ్య ఆదివారం కల్లు తీయడానికి ఈత చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారీ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మయ్యను కరీంనగర్‌లోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని గృహిణి ఆత్మహత్య

- ఏడేళ్ల కూతురు ముందే ఘటన

కోల్‌సిటీ, సెప్టెంబరు 8: ఏడేళ్ళ కూతురు ముందే ఓ గృహిణి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం గోదావరిఖని విఠల్‌నగర్‌లో చోటు చేసుకున్నది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు. సుల్తానాబాద్ మండలం మూలసాల గ్రామానికి చెందిన చొప్పరి అంజయ్య తన భార్య మాధవి(28), ఏడేళ్ల కూతురు రితికతో కలిసి గోదావరిఖని విఠల్‌నగర్‌లో నివాసముటున్నారు. అంజయ్య సెంట్రింగ్ లేబర్‌గా పని చేస్తున్నాడు. అంజయ్య కుటుంబానికి ఎండీ యూసుఫ్ అనే వ్యక్తి కుటుంబానికి కొన్నేళ్లుగా దగ్గరి పరిచయం ఉంది. శనివారం అంజయ్య భార్య మాధవి యూసుఫ్‌కు వీడియో కాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురు ఏడేళ్ల రితిక ముందే అఘాయిత్యం చేసుకుంది. కాగా ఘటన వివరాలను మాధవి కూతురు రితిక కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలిపింది. తన భార్య మరణం పట్ల యూసుఫ్‌పై అనుమానం ఉందని అంజయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

గరకపై గణపతి విగ్రహం

- సూక్ష్మకళాకారుడి అద్భుత ప్రతిభ

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 8:వినాయక నవరాత్రుల సందర్భంగా గరకపై వినాయక విగ్రహం చెక్కి. అందరినీ అబ్బురపరిచాడు పట్టణానికి చెందిన సూక్ష్మకళాకారుడు గుర్రం దయాకర్. గణేషుడికి ఇష్టమైన గరకపై సూక్ష్మగణనాథుడిని తయారుచేశాడు. విగ్రహం తయారు చేయడానికి సుమారు 10గంటల సమయం పట్టిందని దయాకర్ తెలిపారు.


గరకపై గణనాథుడి చిత్రీకరణ





శాంతి కోసమే సాహిత్యం

- పంపాతీరం పుస్తక పరిచయసభలో రచయిత్రి ఓల్గా

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8: వివక్షలు, అణచివేతలు, హింసలేని శాంతియుత జీవితాల కోసమే సాహిత్యాన్ని సృజిస్తు న్నానని రచయిత్రి ఓల్గా స్పష్టం చేశారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో ఆదివారం జరిగిన పంపాతీరం పుస్తక పరిచయ సభలో ఆమె మాట్లాడారు. దేశంలో పెరుగుతున్న హింస, ఆదివాసీలు, దళితులపై జరుగుతున్న దాడులకు చలించి పంపాతీరం నవల రాశానని అన్నారు. కందుకూరి అంజయ్య, తోట నిర్మలారాణి పుస్తక పరిచయం చేయగా పుప్పాల శ్రీరాం ఓల్గా ఐదు దశాబ్దాల సాహిత్య ప్రస్థానాన్ని వివరించారు. పురాణేతిహాసాల పాత్రలను వర్తమానానికి అన్వయిస్తూ అద్భుత సాహిత్యాన్ని ఓల్గా సృష్టిస్తున్నారని కథా రచయిత డాక్టర్ బీవీఎన్ స్వామి అన్నారు. ఇటీవల మరణించిన సాహితీ వేత్తలు డాక్టర్ కె ముత్యం, బండారు అంకయ్య, వడ్డేపల్లి కృష్ణలకు సంతాపం ప్రకటించారు. సాహితీవేత్తలు అన్నవరం దేవేందర్, బూర్ల వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఓల్గాను సన్మానించారు. తెరవే జిల్లా అధ్యక్షుడు సీవి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గాజోజు నాగభూషణం, దామెర లక్ష్మి, కె నాగ మణి, పెనుగొండ సరసిజ, సిరిపురం వాణిశ్రీ, దామరకుంట శంకరయ్య, పిఎస్ రవీంద్ర, నడిమెట్ల రామయ్య, కనకం శ్రీనివాస్, నామని సుజనాదేవి, విలాసాగరం రవీందర్, గీతారెడ్డి పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో పాల్గొన్న కవులు, రచయితలు









ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	1,05,000	1,26,865	80.5	80.053
ఎల్లంపల్లి	80,232	95,256	20.175	19.202
మిడ్ మానేరు	13.394	26,450	27.54	23.509
ఎల్ఎండీ	34,355	1,297	24.034	21.464

దసరా సెలవుల్లోనే పదోన్నతులు


మాట్లాడుతున్న రఘోత్తంరెడ్డి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 8: దసరా సెలవుల్లోనే జీవో నంబరు 11, 12లను సవరించి 6,500 ప్రాథమిక పాఠశాలలకు హెడ్మాస్టర్ల పోస్టులను సృష్టించి, అర్హత కలిగిన సీనియర ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా అవకాశం కల్పించే విధంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్‌లో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్నాథ్ రెడ్డి అధ్యక్షతన జిల్లా శాఖ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ పీఎస్ హెడ్‌మాస్టర్‌ల పోస్టుల మంజూరుతో బీఎడ్ ఎస్జీటీలకు న్యాయం చేస్తామన్నారు. సీపీఎస్ రద్దు విషయాన్ని ఇప్పటికే సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లామని, స్పందించిన సీఎం సీపీఎస్‌ను రద్దు చేస్తామని పీఆర్టీయూ సంఘానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, దామెదర్‌రెడ్డి, మహేంధర్‌రెడ్డి, కమలాకర్‌రావు, గాయత్రిదేవి, జమునదేవి, సురేఖ, రాజు,చిన్నయ్య, రాజశేఖర్, సత్యనారాయణ, చంద్రప్రకాష్, రవికుమార్ తదితరులున్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 8: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ 6వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 27న సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని చేపట్టిన చైతన్య యాత్ర ఆదివారం తెలంగాణ చౌక్ చేరుకుంది. ఈసందర్భంగా శ్రీనివాస్‌కు జిల్లా ఉద్యమకారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా అమరవీరుల స్థూపం వరకు వెళ్లి అమరవీరులకు నివాళులర్పించారు. ఈనెల 27న ఉద్యమకారుల సన్మానసభను నిర్వహిస్తున్నామని, తెలిపారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సన్మాన సభ గోడపోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామి, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఓరుగంటి ఆనంద్, కూల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్, టీయుఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఐలీ ప్రసన్న, రాష్ట్ర నాయకులు, జోజిరెడ్డి, సంజీవరెడ్డి, నాయకులు చొప్పరి సుధాకర్, బీజేపీ నాయకురాలు వరాల జ్యోతి, బోగెపద్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్‌లో గోదావరిఖనికి చెందిన
మహిళా జవాను ఆత్మహత్య


గంగాభవాని(ఫైల్)

జ్యోతినగర్, సెప్టెంబరు 8: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన మహిళా బీఎస్ఎఫ్ జవాను బల్ల గంగా భవాని (26) గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గాంధీనగర్ దంతివాడలో గేట్ డ్యూటీ నిర్వహిస్తున్న గంగా భవాని శనివారం విధులకు హాజరుకాలేదు. బీఎస్ఎఫ్ అధికారులు ఆమె నివసిస్తున్న క్వార్టర్ వద్దకు వచ్చి చూడగా ఉరివేసుకుని కనిపించింది. ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదని, పోస్టుమార్టం అనంతరం తెలిసే అవకాశం ఉన్నదని బీఎస్ఎఫ్ అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గంగాభవాని మృతదేహాన్ని ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తీసుకువచ్చిన బీఎస్ఎఫ్ అధికారులు అక్కడి నుంచి ఆదివారం ఎన్టీపీసీలోని స్వగృహానికి అధికారులు చేర్చారు. గంగాభవాని మృతదేహానికి బీఎస్ఎఫ్ జవాన్లు, రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, ఎన్టీపీసీ ఎస్సై సతీష్‌లు నివాళులు అర్పించారు. సైనిక లాంఛనాలతో గోదావరి తీరంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఎన్టీపీసీ సుభాష్‌నగర్‌కు చెందిన బల్ల సుబ్రహ్మణ్యం, సరస్వతిల చిన్న కుమార్తె గంగాభవాని. పదో తరగతి వరకు స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో చదివింది. ఇంటర్‌మీడియెట్ ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో చదివింది. 2021లో గంగాభవాని బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించింది. పశ్చిమ బెంగాల్‌లో విధులు నిర్వహించిన గంగాభవాని ఎనిమిది నెలల క్రితం గాంధీనగర్ దంతివాడకు బదిలీ అయింది. సెలవుపై ఆగస్టు 5వ తేదీ నుంచి ఈనెల 1వ తేదీ వరకు ఎన్టీపీసీకి వచ్చి తల్లిదండ్రుల వద్ద గడిపింది. ఈనెల 2వ తేదీన తిరిగి విధుల్లో చేరింది. కేరళ రాష్ట్రానికి చెందిన ఒక యువకుడితో ఈ ఏడాది డిసెంబరులో వివాహం చేయాలని అనుకున్నామని ఆమె తండ్రి తెలిపారు. కానీ ఇంతలోనే గంగా భవాని ఆత్మహత్యకు పాల్పడడం ఆమె కుటుంబంలో విషాదాన్ని నింపింది.

ఆర్థిక ఇబ్బందులతో ఆర్కిటెక్చర్ ఆత్మహత్య


కమలాకర్(ఫైల్)

కోరుట్ల, సెప్టెంబరు 8: పట్టణంలోని తిలక్ రోడ్డు ప్రాతానికి చెందిన గుంటుక కమలాకర్ (45) అనే అర్కిటెక్చర్ ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కమలాకర్ కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో ఆర్కిటెక్చర్‌గా పని చేస్తూ బిల్డింగ్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. గణపతి నవరాత్రి ఉత్సవాలు పాల్గొవడానికి రెండు రోజుల క్రితం కోరుట్ల పట్టణానికి చేరుకున్నాడు. కమలాకర్ ఆదివారం ఉదయం పట్టణంలోని తాళ్ల చెరువు ప్రాంతంలోని గంగమ్మ దేవాలయ ఆవరణలో ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు పాల్పడే ముందు ఫోన్ ద్వారా అతడు ఉన్న లోకెషన్‌ను హైదరాబాదులోని మిత్రులకు పంపించాడు.. వెంటనే అక్కడి మిత్రులు కోరుట్లలో ఉన్న మిత్రులకు సమాచారం అందించారు. అక్కడి వెళ్లి చూడగా అప్పటికే కమలాకర్ ఆత్మహత్య చేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చనిపోతున్నట్లు కమలాకర్ తన ఫోన్ ద్వార మిత్రులకు, బంధువులకు మెసెజ్ చేసి ఆత్మహత్య పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కమాలాకర్‌కు బార్య జయశ్రీ, కూతురు సిద్ది, కొడుకు ఓంకార్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి

కోరుట్ల, సెప్టెంబరు 8: కోరుట్ల పట్టణంలోని ఝాన్సి రోడ్డులో ఓ భవన నిర్మాణ పనుల వద్ద కూలి పని చేస్తున్న మహారాష్ట్రకు చెందిన వలస కార్మికుడు ఇస్మాయిల్ (39) విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఝాన్సీ రోడ్డులో నూతన భవన నిర్మాణం కోసం ఏర్పాటు చైసిన పిల్లర్ గుంత వర్షం నీటితో నిండి పోయింది. నీటిని తీయడానికి ఇంటి కాంట్రాక్టర్, యజమాని విద్యుత్ మోటర్‌ను ఏర్పాటు చేసి నీటిని తోడుతున్నారు. గుంత సమీపంలో పని చేస్తున్న ఇస్మాయిల్‌కు విద్యుత్ షాక్ తగలడంతో ఇస్మాయిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇస్మాయిల్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృత దేహం అందించినట్లు పోలీసులు తెలిపారు.

బహుభాషా కృషీవలుడు 'నలిమెల'

- తెలంగాణ బతుకు తండ్లాటకు అక్షర రూపం
- తెలంగాణ సాహిత్య సంస్కృతి, ఉనికి కోసం ఆరాటం
- సోదర బాష సాహిత్యాల మిత్రుడిగా గుర్తింపు
- తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కాళోజీ పురస్కారానికి ఎంపిక
- జిల్లా రచయితలు, కవుల అభినందనలు

సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8: బహుభాషా కృషీవలుడు డాక్టర్ నలిమెల భాస్కర్. కవిగా, రచయితగా, అనువాదకుడిగా, విశ్రాంత ఉపన్యాసకుడిగా ఆయనకు ఎంతో పేరు ఉంది. తెలంగాణ సాహిత్య సంస్కృతి ఉనికిని కాపాడే దిశగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తనదైన పాత్రపోషించారు. 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిష్టాత్మక కాళోజీ నారాయణరావు పురస్కారానికి ఎంపికయ్యారు. పురస్కారంతోపాటు రూ.1.01.116 అందించనున్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో బుచ్చమ్మ, రామచంద్రం దంపతులకు భాస్కర్ జన్మించారు. అధ్యాపకుడిగా, సాహిత్య రంగంలో ఎనలేని కృషి చేస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో స్థిరపడ్డారు. తెలుగు, కన్నడ, తమిళ, మళయాల సామెతలపై ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఫిల్, తెలుగు, మలయాళ కుటుంబ సామెతలపై పరిశోధన చేసి ఉస్మానియా నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను పొందారు. తెలుగు అధ్యపకుడిగా 2011లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 2013 సంవత్సరానికి అనువాద రంగంలో మళయాలం నుంచి స్మారక శశిగల్ నవలను స్మారక శిలలు పేరిట అనువదించి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తరువాత కరీంనగర్ రచయితల్లో రెండోవాడిగా భాస్కర్ నిలిచారు. నలిమెల భాస్కర్ కాళోజీ పురస్కారానికి ఎంపికవడంపై తెలంగాణ రచయితల వేదిక, మానేరు రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.


డాక్టర్ నలిమెల భాస్కర్

పలు భాషలపై పట్టు..

మలయాళం, హిందీ, తమిళం, ఉర్దూ, కన్నడ, మరాఠీ, బెంగాళీ, పంజాబీ, సంస్కృతం, ఒరియా, అస్సామీ, గుజరాతీ, ఇంగ్లీష్, తెలుగు భాషలను అవపోసన పట్టిన నలిమెల భాస్కర్ అనువాద రంగంలో కృషి చేస్తూనే తెలంగాణ ఉద్యమంలో యాస, భాషలను పదిలపరుస్తూ పద కోశాలను అందించారు. 2003లో తెలంగాణ పదకోశాన్నిఅందించడంతో పాటు అదే క్రమంలో 2008లో తెలంగాణ భాష వ్యాసాలు, 2017లో తెలంగాణ భాష దేశీయపదాలు, 2019 తెలంగాణ భాష సంస్కృత పదాలు, 2020లో తెలంగాణ భాష తమిళ పదాలు, 2021లో తెలంగాణ భాష క్రియ పదాలు, సంకలనాలను వెలువరిచారు. తెలంగాణ భాష, యాసపై సాహిత్య రంగంలోనే ప్రత్యేక చర్చకు ఊపిరి పోశారు. ఇతర భాషల నుంచి ఎన్నో కథలను అనువదిస్తూ సంకలనాలను వెలువరిచారు. 1993లో నూరేళ్ల పది ఉత్తమ మళయాల కథల సంకలనాన్ని తెచ్చారు. 1996లో కన్నడం, తమిళం, మళయాలం, హిందీ, మరాఠీ, బెంగాలీ భాషల నుంచి అనువదించిన కథలను అద్ధంలో గాంధారి పేరుతో సంకలనంగా అందించారు. మన సాహిత్య అభిమానులకు యూరోపియన్, రష్యన్, అమెరికన్, ఆఫ్రికన్ సాహితీవేత్తలు ఎంత ఎక్కువ తెలుసో పొరుగున ఉన్న ఇతర భాషాకారుల గురించి తక్కువగా తెలుసు ఈ నేపథ్యంలో భాస్కర్ ఇతర భాషలకు అనుసంధానంగా వారధిగా నిలిచారు. 1998-99లో 35 వారాలపాటు ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో సాహితీ సుమాల పేరుతో 17వ శతాబ్దానికి చెందిన ఉర్దూ కవి మీర్ నుంచి 20వ శతాబ్దం చివరి వరకు అంకురించి ఆకస్మికంగా మాయమైన కొండ జాతి అక్షరం చూబీ దాకా పరిచయం చేశారు. దీంతోపాటు 1994లో మళయాలం నుంచి మోహన వర్మ మనీ మేకర్స్‌ను ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో బిజినెస్ పత్రికలో సీరియల్‌గా వచ్చింది. కన్నడం నుంచి కుండీ నవల, బెంగాల్ నుంచి అవసానం, జైన్ సాహిత్యాన్ని తెలుగులోకి తెచ్చారు.

● తొమ్మిదో తరగతి నుంచే..

తెలంగాణ ఉద్యమంలో డాక్టర్ నలిమెల భాస్కర్ తనదైన శైలిలో సాహిత్యం వైపు అడుగులు వేశారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని శ్రీరామ చంద్రదారుల గ్రంథాలయానికి వెళ్లి వంద లాది డిటెక్టివ్ నవలను చదివారు. ఆ ప్రభావంతోనే 9వ తరగతిలోనే కాలు కదిపావో కాల్చేస్తా డిటెక్టివ్ నవలను రాశారు. పదో తరగతిలో ఒక పాటను రాశారు. ఆ తర్వాత కామారెడ్డిలో ఇంటర్మీడియెట్ చదివే సమయంలో పుస్తకాలతో దోస్తీ చేశారు. నిజామాబాద్ లో అగ్నివీణ పత్రికలో త్రివర్ణ పతాక అనే పద్యం అచ్చుయ్యింది. 1973-74లో మూడు సాంఘీక నవలలు రాశారు. 1974 డిగ్రీలో 'నా మానవుడా' గేయ సంపుటి పుస్తకాన్ని రాశారు. 1976-77లో బీఈడీ చదువుతున్న సమయంలో భాస్కరోక్తులు ప్రచురించారు. 1977లో మంద పేరుతో రాసిన కథ అప్పటి సామాజిక రుగ్మతల నేపథ్యంలో చర్చకు దారి తీసింది. 1978లో ఈ తరం పాటలు, 2000లో సాహితీ సుమాలు సంకలనం, అదే సంవత్సరం తమిళంలోకి తమిళ్ తొట్టక్కల్ తెలుంగు కుయిల్ గళ్ కవిత్వాన్ని అనువదించారు. 2008, 2024లో సుద్దముక్క కవిత్వం, 2010లో భారతీయ సాహిత్య వ్యాసాలు, 2010లో భారతీయ సామెతలు, 2010లో భారతీయ కథలు, దేశ దేశాల కవిత్వం, స్మారక శిలలు, 2016లో నానీ కవి ధైగల్ 2021లో సముద్ర శాస్త్రజ్ఞులు, చలన చలనం, ఇక్కడి నేల, 2022లో ద్రౌపతి మళయాళ అనువాద పరిశోధన, జీవ ద్రైవ్యం కవిత్వాన్ని అందించారు. భాస్కర్ సంపాదకత్వంలో బసవ పురాణ పదకోశాన్ని వెలువరిచారు.

ఎన్నో పురస్కారాలు

బహుభాష కోవిదుడిగా, అనువాదకుడిగా తెలంగాణ నుంచి ముందు వరుసలో నిలిచిన డాక్టర్ నలిమెల భాస్కర్ మళయాలంలో అనువాద నవల స్మారక శిలలకు 2013 కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. 2014లో తెలుగు యూనివర్సిటీ డాక్టర్ బోయి భీమన్న అనువాద పురస్కారం, 1974లో తెలుగు యూనవర్సిటీ పురస్కారం, 1998లో కళాసాగర్ సిరిసిల్ల పురస్కారం, 1999లో కళాజ్యోతి పురస్కారం 2000లో కవిసమయం పురస్కారం, 2001లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2001 బీఎన్ శాస్త్రి పురస్కారం, 2003లో సిరి వెలుగుల పురస్కారం, 2006లో అధికార భాష సంఘం పురస్కారం, 2008లో ద్వానా శాస్త్రి పురస్కారం,. 2010లో ఇండియన్ హైకూ క్లబ్ పురస్కారం, 2015లో డాక్టర్ సినారె, గురజాడ అవార్డు, 2021లో కాళోజీ అవార్డు, 2023లోశ్రీ భాష్యం విజయసారధి పురస్కారం, 2024లో తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రజాకవి, కాళోజీ పురస్కారానికి ఎంపికయ్యారు.

● బాధ్యత పెరిగింది..

- డాక్టర్ నలిమెల భాస్కర్

కాళోజీ పురస్కారానికి ఎంపిక కావడంపై 'ఆంధ్రజ్యోతి' డాక్టర్ భాస్కర్‌ను పలకరించింది. ఆయన మాట్లాడుతూ పురస్కారానికి ఎంపికవడంపై చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత కాళోజీ పేరుతో ప్రభుత్వం అవార్డు ఇస్తుండడం ఆనందదాయకమన్నారు. ఈ పురస్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందని, కాళోజీ విశ్వమానవుడని, ఆయనలో అనేక పార్శ్వాలు కనిపిస్తాయని అన్నారు. కాళోజీ కవిత్వంలో సింహభాగం తెలంగాణ కవిత్వమేనన్నారు. పౌర హక్కుల కోసం పోరాటంతోపాటు తెలంగాణ భాషకు జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక వివిధ సాహిత్య ప్రక్రియల్లో అనేక రచనలు చేశారని కొనియాడారు. 'నీ భాష నీకు ముద్దు అయితే నా భాష. యాస నాకు ముద్దు, నీ తల్లి భాష గొప్పదైతే నా తల్లి భాష కూడా గొప్పదే' అని, తెలంగాణ భాషా సరస్వతి రుణం తీర్చుకోవాలని, దీనికి ఇంకా నిర్మాణాత్మకంగా పని చేయాల్సి ఉంటుందని అన్నారు. వర్ధమాన రచయి తలు అధ్యయనం చేయాలని, ఎంచుకున్న ప్రక్రియలో త్రికరణ శుద్ధిగా పని చేయాలని అన్నారు. ఇప్పటి తరానికి శక్తి సామర్థ్యాలు ఎక్కువని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో సద్వినియోగం చేసుకుంటే సాహిత్య లోకానికి మరింత మేలు జరుగుతుందని అన్నారు.

కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాలన్నదే బీజేపీ లక్ష్యం

-కాంగ్రెస్ 370 ఆర్టికల్ మళ్లీ తెచ్చే కుట్ర
- రాజకీయాలకు అతీతంగా వరద బాధతులను ఆదుకోవాలి
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్ (కరీంనగర్), సెప్టెంబరు 8: కశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలన్నదే నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా కావాలా, ఉగ్రవాద పునరుద్ధరణ కావాలా ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 370 ఆర్టికల్‌ను రద్దు చేసి కశ్మీర్‌ను అభివృద్ధి చేస్తోందన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర హోదాను ఇవ్వాలని నరేంద్రమోదీ భావిస్తున్నారన్నారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించి దేశంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని బండి సంజయ్ అన్నారు. దేశ పౌరులంతా జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని కోరుకోవడంతో పాటు ప్రతి ఒక్కరు అక్కడికి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకే ఏక్ దేశ్‌మే దో ప్రధాన్, దో విధాన్, దో నిషాన్ నహీ చలేగా అంటూ 370 ఆర్టికల్ రద్దు చేశామ న్నారు. ఉగ్రవాదులతో లింకులున్న పార్టీలతో కాంగ్రెస్ పార్టీ జతకట్టి మళ్లీ 370 ఆర్టికల్‌ను తీసుకు వచ్చి ఉగ్రవాదాన్ని పునరుద్ధరించాలని చూస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. వర్షాలతో నష్టపోయిన ప్రజలను అన్ని విధాలా ఆదు కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన వంతు సాయం చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాజకీయ విమర్శలను పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా ఉంటూ బాధితులను ఆదుకోవాలని, రాష్ట్ర ప్రజలంతా తమ వంతుగా సాయం అందించాలని బండి సంజయ్ కోరారు.

విద్యా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 8: విద్యా రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం(టీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమాలోచన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ లెక్చరర్ ఫోరంలో విద్యా వ్యవస్థపై రూపొందించిన విధి విధానాల నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మౌలిక వసతులకు పాఠశాలలకు నిధులు కేటాయించారన్నారు. రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ ఎండీ రియాజ్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థ పటిష్టానికి చర్యలు తీసుకుంటు న్నారన్నారు. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర చైర్మన్ కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ టిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగా సమస్యలపై మేధావుల సమాలోచన అనే కార్యక్రమాన్ని జిల్లాల వారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యారంగంలో ఉన్న సమస్యలు, వాటిని అధిగమించడానికి చేపట్టాల్సిన చర్యలను జిల్లాల వారీగా క్రోడీకరించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజే యాలని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లాలోని మేధావులు, విద్యావం తులు, ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులు, టీచర్లు లెక్చరర్లు హాజరై వారి అభిప్రాయాలను తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పురమల్ల శ్రీనివాస్, టిఎల్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి రాజేశ్వర్, గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం ఆంజనేయులు, మాసం రత్నాకర్, రామచం ద్రారెడ్డి, సముద్రాల లింగారావు, దినేష్, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

తీరని శోకం

- విద్యుదాఘాతంతో బాలుడి మృతి
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు


యశ్వంత్(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 8: వినాయక చవితి వేడుకలను సంతోషంగా జరుపుకుంటున్న ఆ కుటుంబంలో విద్యుత్ ప్రమాదం తీరని శోకం మిగిల్చింది. గ్రామంలో ఏర్పాటు చేసిన గణేశుడి మండపంలో విద్యుత్ బల్బ్ అమర్చుతుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ బాలుడు మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. హుజూరాబాద్ మండలం సిర్సపల్లి గ్రామంలో శనివారం స్నేహితులతో కలిసి గణేశ్ మండపంలో పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందాడు. పండుగ పూట ఒక్కగా నొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంగ వెంకటేష్-లావణ్య కుమారుడు యశ్వంత్(17) ఇంటర్ చదువుతున్నాడు. శనివారం వినాయక చవతి సందర్భంగా గణేశ్ మండపంలో విద్యుత్ బల్బును అమర్చుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఒక్కసారిగా యశ్వంత్ కుప్పకూలిపోయాడు. పక్కన ఉన్న తండ్రి వెంకటేష్ హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు యశ్వంత్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యశ్వంత్ మృతి తీవ్రంగా కలిచి వేసిందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీ వొడితల ప్రణవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సొల్లుబాబు తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి


మహర్షి మృతదేహం

కోరుట్ల, సెప్టెంబరు 8: కోరుట్ల పట్టణం మాదాపూర్‌కాలనీలో శనివారం జరిగిన రోడ్డు ప్రమా దంలో కాలనీకి చెందిన కారంగుల మహర్షి (5) అనే బాలుడు మృతి చెందాడు. మహర్షి కాలనీలోని తన ఇంటి నుంచి రోడ్డుమీ దికి వస్తున్న సమయంలో అదే దారిలో అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడి తలపైకి టైర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పడి వరకు మహర్షీ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపి ఓక సారిగా రోడ్డు ప్రమా దంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మహర్షి తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వంతెన నిర్మాణం ఎప్పుడో..?

- యేటా వర్షాకాలంలో ఇబ్బందులు
- కొట్టుకుపోతున్న కొండ్రికర్ల వాగుపై తాత్కాలిక రోడ్డు
- అవస్థలు పడుతున్న స్థానికులు


వంతెన నిర్మించాలని గ్రామస్థుల నిరసన


కొండ్రికర్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 8: ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా రహదారులు దెబ్బతిన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఎక్కడికక్కడ రహదారులు కోతకు గురయ్యాయి. దీంతో చాలా గ్రామాల్లో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొన్ని గ్రామాలకైతే సంబంధాలు కూడా తెగి పోయాయి. భారీ వర్షాలకు మండలంలోని కొండ్రికర్ల గ్రామ శివారులోని వాగుపై ప్రజలు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రోడ్డు కూడా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వాగుపై వంతెన నిర్మాణం లేకపోవడంతోనే ప్రతి సారి ఈ సమస్య ఏర్పడుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగుపై వంతెన నిర్మాణం ఎప్పుడో పూర్తవుతుందోనని గామస్థులు, ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. గ్రామం నుంచి రైతులు పొలాలకు, పక్క గ్రామాలకు, కథలాపూర్ మండలానికి వెళ్లేదారిలో ఉన్న వాగుపై నుంచి ప్రయాణించాలి. కానీ వంతెన లేక గ్రామస్థులు, ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాగు పై ప్రయాణించడానికి తాత్కాలిక రోడ్డును ప్రతి ఏటా పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసుకుంటున్నారు. వానాకాలంలో కురిసిన వర్షాలతో వాగు ప్రవహించిన సమయంలో సమస్య ఎక్కువగా ఉంటుంది. అయినా ప్రతీ వానాకాలంలో కురిసిన వర్షాలకు వరదలు ఉధృతంగా ప్రవహించడంతో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రోడ్డు కొట్టుపోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. గత స్థానిక ఎన్నికల సమయంలో గ్రామస్థుల సమస్యను పరిష్కరించాలని కోరగా వాగుపై వంతెన నిర్మాణం చేస్తానని అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు నిధులు కేటాయించి వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో బిల్లులో ఎక్కడ ఆటంకాలు ఎదురవుతాయోనని కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేందుకు రావడం లేదని సమాచారం. వంతెన ఎప్పుడు నిర్మాణమవుతుందోనని గ్రామస్థులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

● ఇబ్బందులు పరిష్కరించాలి...

గ్రామంలోని వాగుపై వంతెన నిర్మాణం ఏర్పాటు చేసి ఇబ్బందులు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. వంతెనకు అవతలి వైపున ఉన్న గ్రామాలకు, పొలాలకు రైతులు పోయేందుకు ఇబ్బందులు పడకుండా గతంలో మాజీ ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టు పొందిన వారు పనులు ప్రారంభించకుండా జాప్యం చేస్తున్నారు. మళ్లీ వర్షాకాలానికి ముందే వంతెన నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా అధికారులు దృష్టి సారించి పనులు పూర్తయ్యేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి గేట్లను ఎత్తిన అధికారులు

పెద్దపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పాటు కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి 80,232 క్యూసెక్కుల వరదనీరు వస్తుండడంతో ఆదివారం 12 గేట్లు ఎత్తి 95,256 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. శనివారం రాత్రి వరకు ప్రాజెక్టు నీటి మట్టం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో ఉండడంతో పైనుంచి వరద నీటిని అంచనా వేస్తూ ఎల్లంపల్లి గేట్లను ఎత్తి గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు. ప్రస్తుతం 19.202 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 8 : మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామపంచాయతీ అనుబంధ గోళ్లపల్లిలో బీజేపీ నాయకులు నందనవేణ తిరుపతి తండ్రి ఇటీవల మృతి చెందగా అలాగే అందుగులపల్లి బీజేపీ గ్రామ సీనియర్ నాయకులు కనుకయ్యలు మృతిచెందగా ఆదివారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి వారి కుటుంబాలను పరామర్శించారు. వెంట నాయకులు రాంసింగ్, పల్లె సదానందం, పర్స సమ్మయ్య పలువురు ఉన్నారు.

నర్సాపూర్‌లో ఒకరికి డెంగ్యూ

ఎలిగేడు, సెప్టెంబరు 8 : మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన కలువల సంతోష(68) డెంగ్యూ జ్వరం సోకి కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతోంది. గ్రామం పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే వ్యాధులు సంక్రమిస్తున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు.

సొంతగూటికి చేరిన లింగమూర్తి

ఎలిగేడు, సెప్టెంబరు 8 : మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన ముదిరాజ్ మండల ప్రధాన కార్యదర్శి కీర్తి లింగమూర్తి బీజేపీలో చేరారు. ఆదివారం బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణరెడ్డి బీజేపీ కండువాల కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మీస అర్జున్‌రావు, కన్నం అంజయ్య, గర్రెపల్లి నారాయణ స్వామి, రంజిత్‌రెడ్డి, మల్లారపు అంజయ్య, రాయపాక మనోహర్, జగ్గారాలు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 8: జనగామ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గుండబోయిన భూమయ్య, ఉపాధ్యక్షునిగా గుండబోయిన రాజయ్య, రవీందర్, ప్రధాన కార్యదర్శిగా భూమయ్య, కోశాధికారిగా సదానందం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామమూర్తి, ముఖ్య సలహాదారునిగా శంకర్, సంయుక్త కార్యదర్శిగా సంతోష్, కార్యవర్గ సభ్యులుగా దొరగండ్ల మల్లయ్య, గట్టయ్య, లక్ష్మణ్, పెద్ది రాజు, మల్లేష్, మల్లయ్య, శ్రీనివాస్, శ్రీధర్, రాజులను ఎన్నుకున్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా సహ ప్రముఖ్‌గా సదయ్య

సుల్తానాబాద్, సెప్టెంబరు 8: బీజేపీ ఓబీసీ విభాగం జిల్లా సహ ప్రముఖ్ గా సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుగ్లాంపల్లి గ్రామానికి చెందిన సీనియర్ బీజేపీ నేత చిట్టవేని సదయ్యను నియమించారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర,జిల్లా నాయకులకు సదయ్య కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి పాటు పడతానని అన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి, సెప్టెంబరు 8: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, షీటీంల పట్ల ప్రతి ఒక్కరికి అత్యంత అవగాహన కలిగి ఉండాలని ఏఎస్‌ఐ మల్లయ్య అన్నారు.ఆదివారం మండలం పరిధిలోని పుట్నూర్ కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు ఆయన షీటీం విధివిధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలతో కలిగే అనర్థాలను వివరించారు.

మానేరు పరిసర ప్రాంత ప్రజలు..

ముత్తారం, సెప్టెంబరు 8: మానేరు పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రజాపరిషత్ అధికారి సురేష్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మానేరు డ్యాం గేట్లు ఎత్తడం వలన మానేరు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉండడంతో మానేరు శివారులోగల ఓడెడ్, ఖమ్మంపల్లి, పారుపల్లి గ్రామాల్లో చాటింపు వేయించాలని సూచించారు. అలాగే మత్స్యకారులు రైతులు మానేరు దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కమాన్‌పూర్, సెప్టెంబరు 8 : మండల కేంద్రంలోని 15 నిరుపేద కుటుంబాలకు ఆదివారం శ్రీ సత్యసాయి సేవాదల్, లయన్స్ క్లబ్ కమాన్‌పూర్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది. సుమారు రూ.20 వేలు విలువ చేసే నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో సేవాదల్ ప్రతినిధి లయన్ నూక రమేష్, సాన రామకృష్ణారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లయన్ చౌడవరపు లింగమూర్తి, జబ్బర్‌ఖాన్, లక్ష్మీరాజ్యం తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

కమాన్‌పూర్, సెప్టెంబర్ 8 : టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ నియామకాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ నాయకులు టపాసులు కాల్చుతూ, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. రంగు సత్యనారాయణ, రాజయ్య, గట్టయ్య తదితరులున్నారు.

గురుకులాలన్నీ ఒకేచోట..

- ఇంటిగ్రేటెడ్ భవనాల నిర్మాణాలకు స్థల సేకరణ - పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో ర్యాకల్‌దేవ్‌పల్లిలో గుర్తింపు
- పది ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిన కలెక్టర్ - మంథని, రామగుండంలో మొదలైన స్థల సేకరణ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)


జిల్లా కేంద్రంలో అద్దె భవనంలో నడుస్తున్న బీసీ బాలికల గురుకుల విద్యాలయం

జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న వివిధ సంస్థల గురుకుల విద్యాలయాలకు ఒకేచోట ఇంటిగ్రేటెడ్ హాస్టల్ తరహాలో భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు జిల్లాలో స్థల సేకరణ చేస్తున్నారు. జిల్లాలో ఎస్సీ గురుకుల విద్యాలయాలు ఏడు, బీసీ గురుకుల విద్యాలయాలు ఏడు, మైనార్టీ గురుకుల ద్యాలయాలు మూడు, మినీ గురుకుల విద్యాలయం ఒకటి, తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ ఒకటి ఉంది. ఇందులో మంథని, రామగుండం, గర్రెపల్లి, మల్లాపూర్, నందిమేడారంలో ఉన్న ఎస్సీ గురుకుల విద్యాలయాలకు మినహా మిగతా గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు లేవు. అన్ని అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొన్ని మాత్రమే ఎస్సీ గురుకుల విద్యాలయాలు, అక్కడక్కడ ఒక బీసీ గురుకుల విద్యాలయం ఉండేవి. ఆంధ్రా నుంచి తెలంగాణ విడి పోయిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ హయాంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు ఎస్సీ గురుకుల విద్యాలయాలు, బీసీ గురుకుల విద్యాలయాలు, ఒక మైనార్టీ గురుకుల విద్యాలయాన్ని మంజూరు చేసింది. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించింది. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత జిల్లాకు 3 ఎస్సీ గురుకులాలు, 7 బీసీ గురుకులాలు, 3 మైనార్టీ గురుకులాలు మంజూరు కాగా, అన్ని అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అక్కడ ఉన్న అరకొర వసతుల మధ్య విద్యార్థులు ఇబ్బందులు పడుతూ విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ గురుకులాలకు బీఆర్ఎస్ హయాంలోనే సొంత భవనాలను నిర్మిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, భూముల సేకరణ జరగక పోగా, భవనాల నిర్మాణాలు జరగ లేదు. నవంబర్ చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల విద్యాలయాలకు ఇంటిగ్రేడెడ్ భవనాలను నిర్మిస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు చర్యలు చేపట్టింది.

● నియోజకవర్గాల వారీగా భవనాల నిర్మాణం..

నియోజకవర్గాల వారీగా ఆయా నియోజకవర్గంలో సొంత భవనాలు లేని గురుకులాలన్నింటికీ ఒకేచోట భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడు నుంచి నాలుగు గురుకుల విద్యాలయాలన్నింటినీ ఒకే చోట నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నది. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో ఉన్న మూడు బీసీ, ఒక మైనార్టీ, ఒక ఎస్సీ గురుకుల విద్యాలయానికి ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామంలో గల ప్రభుత్వ స్థలంలో భవన సముదాయాన్ని నిర్మించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నిర్ణయించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లడంతో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు ర్యాకల్‌దేవ్‌పల్లిలో గల ప్రభుత్వ భూములను సర్వేచేసి హద్దులు నిర్ణయించి ఇంటిగ్రేటెడ్ గురుకుల విద్యాలయాల భవన సముదాయ నిర్మాణం కోసం 10 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ మేరకు స్థలాన్ని కేటాయిస్తూ కలెక్టర్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. అలాగే మంథని, రామగుండం నియోజవర్గాల్లో గల గురుకుల విద్యాలయాల కోసం సైతం స్థల సేకరణ చేస్తున్నారు. స్థల సేకరణ పూర్తయిన వెంటనే ప్రభుత్వానికి నివేదిక ప్రకటించనున్నారు. 2024-25 బడ్జెట్‌లో ప్రకటించిన మేరకు ఈ ఏడాది ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి పనులు కూడా ఆరంభమయ్యే అవకాశాలున్నాయి. 2026లో భవనాలను పూర్తి చేసి అందులో విద్యాలయాలను నిర్వహించే విధంగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. మరో రెండేళ్ల వరకు అద్దె భవనాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

- మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 8: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల రామక్రిష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన నివాసంలో జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గుజ్జుల మాట్లాడుతూ హైడ్రా బాధితులకు పునరావాసం.. చెరువులు, కుంటలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు కట్టినట్లు తేలితే వారికి పునరావాసం కల్పించిన తర్వాతే ఖాళీ చేయించాలని సూచించారు. చెరువు భూముల్లో వెంచర్లు వేసిన రియల్ వ్యాపారులపై, ధనవంతుల పట్ల ఉపేక్షించకుండా కొరడా ఝుళిపించాలని డిమాండ్ చేశారు. పటిష్ట ప్రణాళికతో సభ్యత్వం.. దేశవ్యాప్తంగా బీజేపీ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగంగా సాగుతోందని, కోట్లాదిమంది కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వాన్ని పొందుతున్నారని గుజ్జుల పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అధిక స్థాయిలో సభ్యత్వం నమోదయ్యిందని, బూతుల వారిగా టార్గెట్లు పెట్టుకొని పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు మీస అర్జున్ రావు, కన్నం అంజయ్య, ఠాకూర్ రాంసింగ్, శిలివేరు ఓదెలు,పల్లె సదానందం, మహేందర్ యాదవ్, పర్ష సమ్మయ్య, వెల్లంపల్లి శ్రీనివాస రావు, అక్కెపల్లి క్రాంతి, జంగా చక్రధర్ రెడ్డి, బెజ్జంకి దిలిప్ కుమార్, పెండ్యాల కుమార్, మౌటం నర్సింగం, శాతరాజు రమేష్, ఎండి ఫహీం, గర్రెపల్లి నారాయణ, మంథని క్రిష్ణ, మొలుగూరి రాజవీరు, దాసరి హరిక్రిష్ణ యాదవ్, తూడి రవీందర్, కరె విజ్జులు, ములుకోజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువతతో మరింత బలోపేతం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 8: యువతతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని మాజీ ఎంపీపీ కాంగ్రెస్ నాయకులు గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అన్ని గ్రామాల యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మండలంలోని యువత కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ఈనెల 13 లోపు యువత సభ్యత్వం గ్రామగ్రామాన నిర్వహించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజన వేన సదయ్య, యువత అధ్యక్షుడు సొన్నాయిటెంకమ్ శివరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ మునీర్, నాయకులు రానవేన క్రాంతి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన ఇండ్లను పరిశీలించిన అధికారులు

జూలపల్లి, సెప్టెంబరు 8 : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఇటీవల ఏకధాటిగా కురిసిన వర్షాలకు శిథిలమైన ఇళ్లను జూలపల్లి, పెద్దాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ అధికారులు ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్ రెడ్డిలు పర్యటించి దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ వర్షాల ధాటికి దెబ్బతిన్న ఇండ్ల బాధితుల వివరాలను ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.


వర్షాలకు శిథిలమైన ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

రెండో విడత నిధులు మంజూరు చేయాలి

- దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేష్



ఆందోళన నిర్వహిస్తున్న దళిత బంధు లబ్ధిదారులు

మంథని, సెప్టెంబరు 8: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం తమకు మంజూరు చేసిన దళిత బంధు రెండో విడత నిధులను వెంటనే మంజూరు చేయాలని దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోయిల మహేష్ డిమాండ్ చేశారు. స్థానిక శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలోని హాల్‌లో ఆదివారం ప్రత్యేకంగా డివిజన్‌లోని దళిత బంధు రెండో విడత మంజూరు ఎంపిక దారులు సమావేశమయ్యారు. అక్కడి నుంచి ర్యాలీగా స్థానిక అంబేద్కర్‌చౌక్ చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షా 32వేల మంది లబ్ధిదారులను గత ప్రభుత్వం ఎంపిక చేసి 32 జిల్లాల కలెక్టర్ల అకౌంట్లలో రూ. 17,600 కోట్లు జమ చేసిందన్నారు. ఆ 10 లక్షలు ఒక దళిత కుటుంబానికి వస్తే తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితి బాగుపడుతుందని ఆశించిన తమకు నిరాశే మిగిలిందన్నారు. పథకం ప్రారంభమైన కొద్ది రోజులకే ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీల ఎన్నికల కోడ్ కారణంగా పథకాన్ని నిలిపి వేశారన్నారు. పారదర్శకంగా తమకు కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు నిధులు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో అంబేద్కర్ హస్తం పేరుతో రూ. 12 లక్షలను దళితులకు అందిస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా తాము దళిత బంధు సాధన కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకొని దళిత బంధు నిధులు మంజూరు చేయించాలని కోరారు. లేని పక్షంలో దళితులంతా ఏకమై ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి డివిజన్ అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్, నేతలు గద్దల శంకర్, ఆర్ల స్వామి, సంపత్, జక్కన్న, ఎంపిక దారులు పాల్గొన్నారు.



ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుకు సన్మానం


రమేష్‌కు నగదు బహుమతి అందజేస్తున్న ఎస్ఎస్‌వో

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 8: విధి నిర్వహణలో దొంగతనం జరగకుండా అడ్డుకున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు వాంకుడోతు రమేష్‌ను ఆదివారం ఆర్జీ-2 సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహమ్మద్ సన్మానించారు. శాలువాతో సన్మానించి నగదు బహుమతితో పాటు రెయిన్ కోటును బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్ మాట్లాడారు. గతనెల 24న ఓసీపీ-3 ఫేజ్-2లో 60బాక్స్ వద్ద కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఆర్మార్డ్ కేబుల్ దొంగిలించడానికి ప్రయత్నించారు. అక్కడ విధుల్లో ఉన్న వాంకుడోతు రమేష్ వారిని వెంబడించడంతో పారిపోయినట్టు తెలిపారు. ఆర్మార్డ్ కేబుల్ చోరీకి గురైతే క్వారీలోని షావల్స్, డ్రిల్స్‌కు విద్యుత్ సరఫరా నిలిచి బొగ్గు ఉత్పత్తికి ఆంటంకం ఏర్పడేదన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి సింగరేణి ఆస్తుల పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి సముచిత గౌరవం ఉంటుందని ఎస్ఎస్‌న్నారు. ఇన్‌స్పెక్టర్లు రాజలింగు, యాదగిరి పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అల్పాహారాన్ని అందజేసిన ఎమ్మెల్యే

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 8: రామగుండం లయన్స్‌క్లబ్ ప్రజలకు అందిస్తున్న సేవలు మరువలేనివని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మల్లికార్జున్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో వివిధ గ్రామాల నుంచి వినాయకచవితికి పూజా సామగ్రి విక్రయించేందుకు వచ్చిన చిరు వ్యాపారులకు అల్పాహారం, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో లయన్స్‌క్లబ్ ఉచితంగా వైద్య పరీక్షలు, కంటి ఆపరేషన్లు, కృత్రిమ అవయవాల పంపిణీని చేస్తున్నారని, అంతేకాకుండా విద్యార్థులకు నోట్‌బుక్‌లతో పాటు వివిధ సదుపాయాలను కల్పించడం హర్షనీయమన్నారు. అనంతరం నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రజలకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రాజేందర్, బంక రామస్వామి, గోవర్ధన్‌రెడ్డి, ఎల్లప్ప, గుండా వీరేశం, తిలక్‌చక్రవర్తి, ఆంజనేయులు, మనోజ్‌కుమార్, గుండా రాజ్, సుధాకర్, సత్యనారాయణ, రంగమ్మ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆన్‌మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం...

రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గోదావరిఖని పట్టణంలో ఆదివారం ఆన్‌మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని అధ్యక్షులు మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గోదావరిఖని ఓల్డ్ అశోక్ కూలీ అడ్డమీద కూలీలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆన్‌మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని నిర్వహించి పేదల కడుపు నింపుతున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ఎల్లప్ప, కోశాధికారి గోవర్ధన్‌రెడ్డి, సభ్యులు కంజపురం రాజేందర్, బంక రామస్వామి, గుండా వీరేశం, తోకల ఆంజనేయులు, గుండా రాజు పాల్గొన్నారు.


చిరు వ్యాపారులకు అల్పాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే

మల్లికార్జునస్వామి ఆలయానికి విరాళం

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 8 : మండలంలోని తుర్కలమద్దికుంట పెద్దగుట్ట మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణం చేపడుతుండగా గ్రామానికి చెందిన రైస్ మిల్ ఓనర్ వాజిద్ ఆదివారం ఆలయ కమిటి సభ్యులకు రూ.20 వేల విరాళం అందించారు.

ఆర్థిక సహాయం అందజేత

కమాన్‌పూర్, సెప్టెంబర్ 8 : మండలంలోని పెరపల్లి గ్రామానికి చెందిన రావుల ప్రవీన్ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కాగా వారి కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్ తరపున ఆదివారం ఎస్సై కొట్టె ప్రసాద్ చేతుల మీదుగా రూ.60వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజే శారు. సంస్థ అధ్యక్షుడు నారగొని సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

గోదావరిఖని, సెప్టెంబరు 8: మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అనుచరులు ఎండీ అజీం, చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. క్యాంపు కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, నాయకులు నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, సింహాచలం, దీటి బాలరాజు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

ఓదెల, సెప్టెంబరు 8 : మండల కేంద్రం శివారులో శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పరామర్శించారు. పదిమంది కూలీలు పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా గ్యాస్‌గోదాం సమీపంలో ప్రమాదవశాత్తు గ్రామ శివారులో ట్రాలీ బోల్తా పడి ఆరుగురు కూలీలకు గాయాలయ్యాయి. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓదెలకు చెందిన క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని ఎమ్మెల్యే డాక్టర్లను కోరారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, అలాగే విజయేందర్ రెడ్డి ఉన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

పాలకుర్తి, సెప్టెంబరు 8: గణేశ్ నవరాత్రులు, మిలాద్ ఉన్ నబీ పండుగలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని పెద్దపల్లి సీఐ కె ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ ఆర్.స్వామి అధ్యక్షతన జరిగిన శాంతి కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడారు. మండపాల వద్ద ప్రతి రోజు నిర్వాహకులు కాపలా ఉండాలని, డీజేలకు అనుమతి లేదని తెలిపారు. నిమజ్జనం సమయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలు జరుపుకోవడం మన సంస్కృతి అని అన్నారు. అన్ని మతాలను, అన్ని సంసృతి సంప్రదాయాలను కలగలిపి గౌరవించే ఆచారం మన భారాత దేశానికి తరతరాలుగా వస్తున్న ఆచారమని దానిని ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ రానున్న తరాలకు మన దేశ సంస్కృతి సంప్రదాయాలను అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో పలువురు ముస్లీమ్ పెద్దలు,క్రిష్టియన్ మత పెద్దలు,పలు గ్రామాల గణపతి ప్రతిష్ఠల నిర్వాహకులు,పలు గ్రామాల మాజీ,తాజా సర్పంచ్‌లు,మాజీ ఎంపిటిసీలు పాల్గోన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు ఆరుముళ్ల పోషం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 8: బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్నిప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని జిల్లా సభ్యత్వ నమోదు ప్రభారి ఆరుముళ్ల పోషం, జిల్లా ప్రముఖ్ క్యాతం వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం మార్కండేయకాలనీలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా కోఆర్డినేటర్లు, శక్తి కేంద్రాలు, బూత్‌ల వారిగా ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాకు 1.35లక్షల సభ్యత్వ లక్ష్యాన్ని నిర్దేశించిందని, అట్టి లక్ష్యాన్ని పూర్తి చేయాలని, ఈనెల 10న జిల్లా కేంద్రంలో అమర్‌చందర్ కళ్యాణమండపంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభం కానున్నదని, 11వ తేది నుంచి మండల కేంద్రాలు, మండల పార్టీ అధ్యక్షులు సభ్యత్వ నమోదునుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, జిల్లా అధ్యక్షులు చందుపట్ల సునీల్‌రెడ్డి సభ్యత్వాన్ని స్వీకరించనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పోలుసాని సంపత్‌రావు, జక్కుల నరహరి, రాజం, కృష్ణ, రాజేష్‌నాయక్, సంతోష్, శ్రావణ్ పాల్గొన్నారు.

విద్యా కమిషన్ చైర్మన్‌గా మురళి నియామకంపై సంబరాలు

ఓదెల, సెప్టెంబరు 8: మండలంలోని కనగర్తి వాసి అయిన ఆకునూరి మురళికి రాష్ట్ర విద్య కమిషన్ చైర్మన్‌గా నియామకం పట్ల మండలంలోని గ్రామస్తులంతా సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ పాలన ఏర్పడిన తర్వాత మురళిని గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్‌గా నియమించడం పట్ల మండల ప్రజలతోపాటు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలను నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ అధ్యక్షుడు అంజి గౌడ్, కందుల సదాశివ, కసిరెడ్డి మహేంద్రరెడ్డి, చొప్పరి రాజన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా ఫొటోగ్రాఫర్ల సంఘం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

సుల్తానాబాద్, సెప్టెంబరు 8: ఇటీవల నూతనంగా ఎన్నికైన జిల్లా ఫొటోగ్రాఫర్ల కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫొటోగ్రాఫర్ల సంఘ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 8: పట్టణంలోని ఎంబీ గార్డెన్‌లో సఫాబైతుల్ మాల్ పెద్దపల్లి జిల్లాశాఖ అధ్యక్షుడు ముఫ్తి ఇంతియాజ్ అసాధి ఆధ్వర్యంలో గత ఆగస్టు మాసంలో నిర్వహించిన టాలెంట్‌టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు ప్రదానోత్సవం చేశారు. కార్యక్రమంలో మజ్లిస్ తహఫుజ్ ఖత్మె నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్, మీర్జా అహ్మద్ బేగ్, మౌలానా కాజిమ్, మౌలాన జమీల్, మౌలాన అబ్దుల్ హన్నాన్, హఫీజ్ వసిముద్దీన్, హాఫిజ్ రిజ్వాన్, ముఫ్తి షఫీక్, మౌలాన ఇర్ఫాన్, మౌలాన తౌసీఫ్, హఫీజ్ అంజద్, హఫీజ్ అహ్మద్ నియాజీ, కలీమ్ షరీఫ్, తౌహీద్, మహమ్మద్ రఫీ, అబ్దుల్ రాఫె, ఇమ్రాన్ బేగ్, పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 8: రానున్న పంచాయితీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని పెద్దపల్లి మండలం హన్మంతునిపేట అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు కాంపెల్లి సాగర్, ఆరెపల్లి రఘు కోరారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్త గ్రామ పంచాయితీగా ఏర్పడి ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్నా పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ దక్కలేదని వాపోయారు. చిన్న గ్రామాలను ఎస్సీ రిజర్వేషన్‌కు ఎంపిక చేశారని మా గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. సమావేశంలో ఆరెపల్లి తిరుపతి, చలిగంటి శ్రీనివాస్, సురేష్, దీపక్, సుమన్, రాజేష్, రమేష్, తిరుపతి, రాజేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో ఎస్ఐ పల్లె నిద్ర

ఓదెల, సెప్టెంబరు 8 : మండలంలోని గూడెంలో శనివారం రాత్రి ఎస్ఐ అశోక్ రెడ్డి పల్లెనిద్ర నిర్వహించారు. ఇందులో భాగంగా నిరుపేద మహిళ తిప్పారపు రాజమ్మకు బియ్యం బస్తాను అందజేశారు. రాజమ్మకు ఇల్లు నిర్మాణానికి కృషిచేసి అండగా ఉంటామని తెలిపారు.

పదిహేను రోజులకే పాడైపోయిన రోడ్డు

జూలపల్లి, సెప్టెంబరు 8 : మండలంలోని అబ్బాపూర్ గ్రామం నుంచి అదే గ్రామ శివారులోని రైతు వేదిక వరకు మంజూరైన రోడ్డు 15 రోజులకే పాడైంది. కోటి రూపాయల నిధులతో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణం నాన్యత లోపించి శిథిలమైపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.